క్లుప్తంగా

వైభవంగా శ్రీకృష్ణుని సంబరాలు



గెంబలి వారిచే పూజలందుకుంటున్న దేవుళ్లు

వీరఘట్టం: స్థానిక కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన గెంబలి వారు ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని సంబరాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వందేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఈ సంబరాలను అత్యంత వైభవంగా చేపట్టేందుకు ఉత్సవ కమిటీ ముమ్మర ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. దీంతో సమీప గ్రామాల నుండి వీరి బంధువులు పెద్ద ఎత్తున వీరఘట్టం రావడంతో స్థానిక గెంబలివీధిలో సందడి నెలకొంది.

ఒకే ఒక్క నామినేషన్

సీతంపేట: పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి ఒకే ఒక్క నామినేషన్ శుక్రవారం దాఖలైనట్టు రిటర్నింగ్ ఆఫీసర్ కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి నామినేషన్ దాఖలు చేశారన్నారు.

దరఖాస్తుతోనే పరీక్షకు హాజరు కావచ్చు..

భామిని: ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి సంబంధించి ఈ నెల 21న జరగనున్న పరీక్షకు హాల్‌టికెట్ లేకున్నా ప్రింటెడ్ దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డుతో హాజరు కావచ్చునని ప్రిన్సిపాల్ ఆర్.శికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రింటెడ్ అప్లికేషన్ చూసి మోడల్ స్కూల్‌లోనే హాల్‌టికెట్ పొందవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ కాని అభ్యర్థులకు ఈ వెసులుబాటు కల్పించినట్టు తెలిపారు. 21న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ: అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కోటదుర్గ ఆస్పత్రి ఆవరణలో ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరికరాల వినియోగంపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు.

పకీరునాయుడు మృతికి సంతాపం



పకీరు నాయుడు

పాలకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బాసూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు అల్లిన పకీరు నాయుడు అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పేర్కొన్నారు. ఆ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'ఫ్రైడే - డ్రైడే' కచ్చితంగా అమలు చేయాలి

- డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

పార్వతీపురంటౌన్: డ్రైడే పాటించేలా ప్రజల్లో చైతన్యం కలిగించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. నర్సిపురంలో వైద్య సిబ్బంది చేపట్టిన 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు, కుండీలు, పాడైన వస్తువులు, రుబ్బురోళ్లు, ప్లాస్టిక్ వస్తువులు తదితర వాటిలో చేరిన మురుగునీటిని పరిశీలించారు. అందులో పెరుగుతున్న దోమల లార్వాలను స్థానికులకు చూపించి, వాటి వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వాటిని పారబోయించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాలువల్లో చెత్తాచెదారం వేయరాదని సూచించారు. మురుగునీరు ఉన్నట్లయితే అందులో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, తదితర వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయన్నారు. అనంతరం స్థానిక సచివాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

గ్రామంలో నిర్వహించిన డ్రైడే వివరాలను సంబంధిత యాప్, వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో నమోదును పరిశీలించారు. అనంతరం ప్రిజం-10 అమలు తీరుపై ఆరా తీశారు. అడాప్షన్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్న గర్భిణులు, బాలింతల వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. దీన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎం.జగన్మోహనరావు, వైద్య సిబ్బంది ఆదిలక్ష్మి, రాజేశ్వరి, వెంకటరమణ, కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ సుందరమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా కళావతి నామినేషన్

- భారీగా తరలివచ్చిన ప్రజలు
- శ్రీవారి సన్నిధిలో నామినేషన్ పత్రంపై సంతకాలు



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి

సీతంపేట: అశేష జనవాహిని వెంట రాగా పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా విశ్వాసరాయి కళావతి శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సీతంపేట ఐటీడీఏలో నామినేషన్ దాఖలు చేశారు. తొలుత స్థానికంగా ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి వేదపండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. దైవ సన్నిధిలో నామినేషన్ పత్రంపై ఉదయం 11.56 నిమిషాలకు సంతకాలు చేశారు. అనంతరం రోడ్ షో నిర్వహించారు. మహిళలు మంగళహారతులు పట్టి... తిలకం దిద్దుతూ స్వాగతం పలికారు. స్థానిక వారపు సంత నుంచి ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మారుమూల ప్రాంతాల నుంచి సైతం గిరిజనులు రావడంతో సీతంపేట కిక్కిరిసింది. జై జగన్, జైజై జగన్, జై కళావతమ్మ అంటూ నినదించారు. అనంతరం ఐటీడీఏకు చేరుకుని అంబేడ్కర్ బ్లాక్‌లో రిటర్నింగ్ ఆఫీసర్ కల్పనాకుమారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణ, పాలకొండ మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కె.సూర్యప్రకాషరావు, వీరఘట్టం మండల ఎంపీపీ దమల పాటి వెంకటరమణ ఎమ్మెల్యేకు మద్దతుగా వెళ్లారు.

కోటదుర్గమ్మ ఆలయంలో కళావతి పూజలు



కోటదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న కళావతి, విక్రాంత్ తదితరులు

పాలకొండ: పాలకొండ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితుల ఆశీర్వాదాలు తీసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కళావతికి విజయ తిలకం దిద్ది ర్యాలీని ప్రారంభించారు. అక్కడ నుంచి పార్టీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం వద్ద ఆశీర్వాదం తీసుకుని సీతంపేట వరకు ర్యాలీగా వెళ్లారు.

కళావతిపై కొండంత అభిమానం



సీతంపేట: శ్రీవారి సన్నిధిలో నామినేషన్ పత్రంపై సంతకాలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

సీతంపేట: పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా విశ్వాసరాయి కళావతి నామినేషన్ పర్వం శుక్రవారం అట్టహాసంగా సాగింది. కళావతి నామినేషన్‌కు మద్దతుగా ప్రజలు భారీగా తరలివచ్చి కొండంత అభిమానం చూపించారు. మారుమూల పల్లెల నుంచి గిరిజనం సీతంపేటకు చేరుకున్నారు. నియోజకవర్గంలోని పాలకొండ, సీతంపేట, వీరఘట్టం, భామిని మండలాల నుంచి అశేష జనవాహిని తరలివచ్చింది. దైవ సన్నిధిలో ఉదయం 11.56 నిమిషాలకు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అక్కడ నుంచి రోడ్‌షో నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ జనాలకు అభివాదాలు చేస్తూ రోడ్‌షో నిర్వహించారు. ఐటీడీఏ వరకు జరిగిన రోడ్‌షోలో అడుగడుగున జన నీరాజనం పలికారు.

అడుగడుగున జన నీరాజనం

గడిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అలుపెరగకుండా ప్రతీ గ్రామాన్ని జల్లెడపట్టి తిరిగి సమస్యలు పరిష్కారానికి కృషి చేసిన పాలకొండ ఎమ్మెల్యే కళావతి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి దర్పణంగా తమ అభిమానాన్ని చాటుకుంటూ నామినేషన్ ఘట్టానికి తరలివచ్చారు. సీతంపేట నుంచి ఐటీడీఏ వరకు రెండు కిలోమీటర్ల పొడవునా దాదాపు గిరిజనులు బారులుతీరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే కళావతి

ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి అన్నారు. అడ్వంచర్ పార్కు వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఐదేళ్లలో ఎనలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి చరిత్రలో నిలిచిపోయిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా మూడోసారి నన్ను హ్యాట్రిక్ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి నేతల కుట్రలు, కుతంత్రాలు తిప్పికొట్టాలన్నారు.

నోమోర్ చంద్రబాబు - వన్స్‌మోర్ జగన్‌మోహన్ రెడ్డి: ఎమ్మెల్సీ విక్రాంత్

నోమోర్ చంద్రబాబు వన్స్‌మోర్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. అడ్వంచర్ పార్కు వద్ద ఆయన మాట్లాడుతూ కూటమిని కుప్పకూల్చవలసిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రానికి చంద్రగ్రహణం వీడాలన్నారు. పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతికి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, మూడో సారి కూడా ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయాన్ని అందించు స్వామీ..

వీరఘట్టం: సార్వత్రిక ఎన్నికల్లో తనకు హ్యాట్రిక్ విజయాన్ని అందించు స్వామీ అంటూ పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి వండవ గ్రామంలోని దేవాలయాల్లో శుక్రవారం పూజలు చేశారు. తొలుత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో, అనంతరం షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో పూజలు చేశారు. తన పేరుతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతుల గోత్రనామాలతో పూజలు చేయించారు. ముహూర్తం ప్రకారం ఉదయం 9.15 గంటల తర్వాత ఇంటి నుండి బయలుదేరి దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. అంతకు ముందు తన కుటుంబ సభ్యులైన అక్కలు, బావలకు పాదాభివందనం చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ర్యాలీగా నామినేషన్ వేసేందుకు సీతంపేట బయలుదేరారు.

పోలీసుల భారీ బందోబస్తు



ఆర్‌వో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో ఇక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి శుక్రవారం నామినేషన్ వేయడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళిల ఆధ్వర్యంలో నాలుగు మండలాల ఎస్‌ఐలు ఉన్నారు. భారీ జనసందోహం ఎమ్మెల్యే నామినేషన్‌కు మద్దతుగా రాగా వంద మీటర్లలోపే అందరిని ఆపివేశారు. కేవలం అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే ఆర్‌వో కార్యాలయానికి పంపించారు.

ఎన్నికలకు సహకరించాలి



సాయిధ బలగాలతో కలసి కవాతు నిర్వహిస్తున్న ఎస్‌ఐ

పాలకొండ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పాలకొండ ఎస్‌ఐ ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలో సాయుధ బలగాలతో కలసి శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో కొత్తవీధి, గొల్లవీధి, కష్పావీధితో పాటు పలు వార్డుల్లో బలగాలు కలియ తిరిగాయి. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

ఉప్పెనలా తరలిన అభిమానులు



ఎమ్మెల్యే కళావతి నామినేషన్ ఘట్టానికి తరలివెళుతున్న భామిని మండల పార్టీ నాయకులు

భామిని: పాలకొండ ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని విశ్వాసరాయి కళావతి శుక్రవారం నామినేషన్ వేయగా భామిని మండలం నుంచి పార్టీ అభిమానులు ఉప్పెనలా తరలివెళ్లారు. మండుటెండను సైతం లెక్క చేయక భారీగా పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివెళ్లారు. వీరంతా ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి వెంట నామినేషన్ సమయంలో వెళ్లారు.

చెక్‌పోస్టు తనిఖీ



తాటిశీల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఆర్‌వో రమణ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాటిశీల వద్ద (గుణుపూర్ రోడ్డు) సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కురుపాం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.రమణ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెక్‌పోస్టు వద్ద బలగాలు నిర్వహిస్తున్న తనిఖీలను పరిశీలించారు. వచ్చీపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలంటూ సూచనలు చేశారు. ఆయన వెంట తహశీల్దార్ పి.రామారావు ఉన్నారు.

మండుటెండను సైతం లెక్కచేయక..



కళావతికి మద్దతుగా తరలివచ్చిన మంగళాపురం గ్రామస్తులు

పాలకొండ రూరల్: తమ అభిమాన నాయకురాలు విశ్వాసరాయి కళావతి ముచ్చటగా మూడవసారి వైఎస్సార్ సీపీ తరపున నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటూ శుక్రవారం నామినేషన్ వేయడంతో పార్టీ శ్రేణులు, అభిమానులు మండుటెండను సైతం లెక్కచేయక తరలివెళ్లారు. కళావతికి తమ మద్దతు తెలిపేందుకు మండల, పట్టణ ప్రజలు పోటెత్తారు. పాలకొండ పట్టణ, మండల పరిధిలో ప్రతీ గ్రామం, వార్డు నుంచి మహిళలు, యువత, అభిమానులు స్వచ్ఛందంగా సీతంపేట పయనమయ్యారు. దారి పొడువునా గ్రామాల వద్ద ప్రజలు ఎదురొచ్చి జై కళావతి నినాదాలతో హోరెత్తించారు. నిండు మనసుతో ఆశీర్వదించేందుకు మండుటెండను, తీవ్రమైన వడగాలులను లెక్కచేయకుండా వేలాదిగా కళావతి వెంట అడుగులో అడుగు వేశారు. జగనన్న పాటలకు నృత్యాలు చేస్తూ రెట్టించిన ఉత్సాహంతో సందడి చేశారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



బాసంగిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జియ్యమ్మవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలు గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా బాసంగి, గవరమ్మపేటలో శుక్రవారం కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్‌ఐ చిన్నంనాయుడు కోరారు. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు.

వలంటీర్ల రాజీనామా



పాలకొండ రూరల్: రాజీనామా పత్రాలు ఎంపీడీవోకు అందజేస్తున్న తంపటాపల్లి వలంటీర్లు



గరుగుబిల్లి: రాజీనామా పత్రాలను చూపిస్తున్న రావివలస వలంటీర్లు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి గ్రామానికి చెందిన వలంటీర్లు స్వచ్ఛందంగా తమ విధులకు రాజీనామా చేశారు. శుక్రవారం 11 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణకు అందించారు. ప్రతిపక్ష పార్టీలు తమపై చేస్తున్న ఆరోపణలు తిప్పికొట్టేందుకు ఈ నిర్ణయం తీసుకుంన్నట్లు వారు తెలిపారు.

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, రావివలస, తోటపల్లి గ్రామాలకు సంబంధించి 21మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను శుక్రవారం ఎంపీడీవో పి.సూర్యనారాయణకు అందజేశారు. రావివలసలకు సంబంధించి 19మంది, గరుగుబిల్లి, తోటపల్లి గ్రామాల నుంచి చెరో ఒకరు రాజీనామా పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

కోలాహలంగా పుష్పశ్రీవాణి నామినేషన్

- భారీగా తరలివచ్చిన అభిమానులు
- జనసంద్రమైన కురుపాం



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తూ.. వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తును చూపిస్తున్న కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి. చిత్రంలో అరకు ఎంపీ అభ్యర్థిని తనూజారాణి

కురుపాం: కురుపాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాముల పుష్పశ్రీవాణి అట్టహాసంగా శుక్రవారం నామినేషన్ వేశారు. పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరాగా కురుపాం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ఆమె నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణకు అందజేశారు. ఆమెతో పాటు భర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థిని డాక్టర్ తనూజారాణి ఉన్నారు. అంతకు ముందు పుష్పశ్రీవాణి స్వగ్రామం జియ్యమ్మవలస మండలం చిన్నమేరంగి నుంచి 9.30 గంటలకు నామినేషన్ వేసేందుకు బయలుదేరారు. తాళ్లడుమ్మ, దాసరిపేట మీదుగా కురుపాం నియోజకవర్గ కేంద్రానికి చేరుకొని హుకుంపేట వద్ద ఉన్న తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అధిక సంఖ్యలో హాజరైన అభిమానుల మధ్య నామినేషన్ ఘట్టాన్ని పూర్తి చేశారు. అక్కడ నుంచి భారీ ర్యాలీగా మండల కేంద్రం నుంచి రావాడ కూడలిలో ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్దకు చేరుకున్నారు.

మూడోసారి ఆశీర్వదించండి : పుష్పశ్రీవాణి

కురుపాం నియోజకవర్గం మరింత అభివృద్ధికి ముచ్చటగా మూడోసారి తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కోరారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కురుపాం నియోజకవర్గానికి రూ.300 కోట్లతో రహదారులు నిర్మించామని, సంక్షేమానికి రూ.1700 కోట్లు ఖర్చు చేశామన్నారు. విద్య, వైద్య సదుపాయాలు గత టీడీపీ ప్రభుత్వం కంటే వంద శాతం మెరుగుపడ్డాయన్నారు. గిరిజన విద్యార్థుల ఉన్నత చదువుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను నిర్మించిందన్నారు. ఐదేళ్ల పాలనలో అభివృద్ధి జరిగిందని అనిపిస్తేనే ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ కల్లబొల్లి మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన రెండు ఓట్లను అరకు ఎంపీ అభ్యర్థిని డాక్టర్ తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థినైన తనకు వేసి గతం కంటే ఎక్కువ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎస్సీ కమిషన్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి, కురుపాం మండల మండల కన్వీనర్ గౌరీశంకరరావు, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, కొమరాడ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్‌రావు, ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మీ, గుమ్మలక్ష్మీపురం మండల ఎంపీపీ దీనమయ, జెడ్పీటీసీ ఎం.రాధిక, గరుగుబిల్లి మండలం ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, జియ్యమ్మవలస మండల ఎంపీటీసీలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి, ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పరీక్షిత్‌రాజు తదితరులు

పుష్పశ్రీవాణి హ్యాట్రిక్ విజయమే లక్ష్యం



ర్యాలీగా వెళ్తున్న ఎంపీపీ ఉరిటి రామారావు తదితరులు

గరుగుబిల్లి: కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాముల పుష్పశ్రీవాణి హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న పాముల పుష్పశ్రీవాణి కురుపాంలో శుక్రవారం వేసిన నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఉత్సాహంగా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014, 2019 ఎన్నికల్లో పాముల పుష్పశ్రీవాణి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై మండలానికి, నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నుకొనేందుకు కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకుల మాయమాటలను ఎవ్వరూ విశ్వసించే పరిస్థితి లేదన్నారు. ప్రసుత్తం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నిక కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ధనుంజయరావు, కె. అచ్యుతరావు, ఆర్.రామినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.దామోదరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు కె.ఇందుమతి, టి.ఎల్లంనాయుడు, బి.మహేశ్వరరావు, డి.నారాయణమ్మ, జి.తేజేశ్వరరావు, బి.లక్ష్మి, ఎం.భాగ్యలక్ష్మి, ఎ.సింహాచలమమ్మ, ఎస్.దివ్యలక్ష్మి, జి.నారాయణమ్మతో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తమ అభిమాన నాయకురాలిని గెలిపించేందుకు కృషి చేస్తామని కార్యకర్తలు పేర్కొన్నారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన కార్యకర్తలు



పెదబుడ్డిడి నుండి నామినేషన్‌కు వెళ్లిన కార్యకర్తలు

జియ్యమ్మవలస: కురుపాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని పాముల పుష్పశ్రీవాణి శుక్రవారం నామినేషన్ దాఖలు చేయగా.. పార్టీ శ్రేణులు మండలం నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని 31 పంచాయతీల నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో వెళ్లారు. పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రతిన బూనారు.

ఉపాధి పనుల వద్ద మౌలిక సదుపాయాలు



వేతనదారులతో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ

జియ్యమ్మవలస: ఉపాధి పనుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. కుందరతిరువాడ గ్రామంలో ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. వారికి తగిన సదుపాయాలు లేవని సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత సంవత్సరం రూ.90వేల కోట్లు ఉపాధి హామీ పథకానికి ఖర్చు పెడితే ఈ సంవత్సరం కేవలం రూ.60వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని అన్నారు. గతంలో ఉపాధి హామీ వేతనదారులకు టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీరు, మజ్జిగ, గుణపాలు, తట్టలు మంజూరు చేసారని ప్రస్తుతం అటువంటివి లేవన్నారు. రానున్న రోజుల్లో ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసే ధోరణిలో ఉందన్నారు.